పల్లె పండగ పైసలెక్కడ?



- నెలలు గడుస్తున్నా అందని బిల్లులు
- లబోదిబోమంటున్న టీడీపీ నేతలు
- వడ్డీలకు వదులుతున్న చేతిచమురు



బలిజిపేటలో నిర్మించిన సీసీ రోడ్డు

బలిజిపేట: పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చడంలో టీడీపీది విభిన్న శైలి. అధికారంలో ఉన్నన్నాళ్లు తమవారికి అన్ని విధాలుగా లబ్ధి చేకూరేలా కార్యక్రమాలు రూపొందిస్తారు. అందులో భాగంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పనులు వారికే అప్పగిస్తుంటారు. పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించి ఎంతో కొంత వెనకేసుకోవచ్చని, ప్రభుత్వం తమదే కాబట్టి పనులు పూర్తయిన వెంటనే బిల్లులు వస్తాయని టీడీపీ నేతలు భావించారు. మదుపులు పెట్టి పనులుచేసి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాలేదు. ఎప్పుడు వస్తాయో కూడా తెలియక లబోదిబోమంటున్నారు. ఆదాయం వస్తుందని ఆశపడి వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు చేశామని, బిల్లులు రాక పోవడంతో వడ్డీలు పెరిగిపోయి అప్పుల భారం కుంగదీస్తోందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దలు తమ కార్యకర్తలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టిసారించారు. అందులో భాగంగా పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి సీసీ రోడ్లు, కాలువ పనులు అప్పగించారు. మండలంలో రూ.2.05కోట్లతో 40పనులకు అనుమతులు పొందారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు పంచాయతీ సర్పంచ్‌లు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులపై ఒత్తిడి పెట్టి సర్పంచ్‌లకు కాకుండా వెండర్ విధానంలో టీడీపీ నాయకులే చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి బిల్లులు మంజూరు చేయించుకుని కొంత ఆదాయం పొందవచ్చనుకున్నారు. కొంతమంది వద్ద పెట్టుబడి లేకపోయినా అప్పులు తెచ్చిమరీ పనులు చేశారు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. దీంతో టీడీపీ నాయకులు అధికారుల చుట్టూ తిరుగుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన 9నెలల కాలంలోనే బిల్లుల చెల్లింపులలో ఇంత ఆలస్యం జరిగితే భవిష్యత్తులో పనులు ఎలా చేయగలమని కొందరు గుసగుసలాడుకుంటున్నారు.

మండలంలో పల్లె పండుగ పనుల వివరాలు:
మండలంలో రూ.2.05కోట్లతో 40పనులు నిర్వహించేందుకు అనుమతులు పొందారు. కొంతకాలం తాత్సారం జరిగినా టీడీపీ నాయకులు పనులు చేశారు. ఇప్పటికి పూర్తయిన పనులు 36. దీనికి సంబంధించి రూ.1.30కోట్లు ఖర్చు చేశారు. ఇంకా 4పనులు ప్రారంభం కాలేదు.

త్వరలోనే బిల్లుల చెల్లింపు

పల్లెపండుగ పేరుతో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, కాలువలకు సంబంధించిన పనుల బిల్లులు అప్‌లోడ్ చేశాం. త్వరలోనే వాటి మొత్తాలు వస్తే చెల్లింపు చేస్తాం. ఇంకా ప్రారంభం కాని పనులు ప్రారంభించి పూర్తిచేయనున్నాం.

– అంబేడ్కర్, పీఆర్ ఏఈ, బలిజిపేట

క్లుప్తంగా

సీతంపేటకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



సీతంపేట గ్రామాన్ని సందర్శించిన సీపీఎం నాయకుడు పి.రాము

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలం సంగవలస పంచాయతీ పరిధి సీతంపేట గిరిజన గ్రామానికి కనీసస్థాయిలో మౌలిక సదుపాయాలు లేక గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకుడు పి.రాము అన్నారు. ఈ మేరకు శుక్రవారం సీతంపేట గ్రామానికి వెళ్లిన ఆయన మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలుగా గ్రామంలో రోడ్డు సౌకర్యం కానీ కాలువల సదుపాయం కానీ లేక గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు సంగవలస నుంచి సీతంపేట గ్రామం వచ్చేందుకు రహదారి సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు సీతంపేట గ్రామాన్ని సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సజావుగా సేకరణ జరగాలి



పులిగుమ్మిలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ జీవీ రమణమూర్తి

పార్వతీపురం రూరల్: క్రమం తప్పకుండా ప్రతిరోజూ గ్రామాల్లో ఇళ్ల నుంచి సజావుగా చెత్త సేకరణ జరగాలని ఈఓపీఆర్‌డీ జీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పులిగుమ్మి గ్రామంలో చెత్త సేకరణను పరిశీలించి పారిశుద్ధ్య సిబ్బంది, గ్రామస్తులతో మాట్లాడి అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో గ్రామాల్లో వారికి కేటాయించిన వీధుల్లోకి వెళ్లి చెత్తను సేకరించి చెత్తసంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. అలాగే గ్రామస్తులు ఇళ్ల పరిసరాల్లో బాధ్యతా రహితంగా చెత్తను పారవేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలని కోరారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శితో కలిసి చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు.

విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

పార్వతీపురం: కడప జిల్లా కేంద్రంలో ఈనెల 26, 27,28 తేదీలలో జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాల నిర్వహణలో ఏఐఎస్‌ఎఫ్ ముందుందన్నారు. విద్యారంగం సంక్షోభంలో ఉందని, అశాస్త్రీయ భావాలతో విద్యార్థుల మనస్సు విచ్ఛిన్నమయ్యేలా ఉందన్నారు. భవిష్యత్‌లో నిర్వహించబోయే విద్యా వ్యతిరేక పోరాటాల గురించి ఒక వేదికలో చర్చించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులు పాల్గొని తమ అమూల్యమైన సందేశాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జి, వికాస్, సంతోష్‌కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

సాలూరు: బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 950 మంది అభ్యర్థులు హాజరై వారి ధ్రువీకరణ పత్రాలను బ్యాంకర్లకు అందించారు. కాగా 1090 మంది దరఖాస్తు చేసుకోగా, 950 మంది హాజరయ్యారని వారిని 11 శాఖల బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట



ముహూర్తపు రాట వేస్తున్న శర్మయాజీ దంపతులు

పార్వతీపురం టౌన్: శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 6న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు శ్రీ విద్య సర్వమంగళాదేవి పీఠం వ్యవస్థాపకుడు మురపాక కాళిదాసు శర్మ యాజీ తెలిపారు. కల్యాణానికి సంబంధించి శర్మయాజీ దంపతులు శుక్రవారం ముహూర్తపు రాట వేశారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో భక్తులు పాల్గొనాలని కోరారు. కల్యాణానికి సంబంధించిన పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను పలువురు దాతలు సమర్పించనున్నట్లు తెలిపారు.

బూర్జ ఉన్నత పాఠశాలలో బడి బయట విద్యార్థి చేరిక



బూర్జ ఉన్నత పాఠశాలలో చేర్పించిన విద్యార్థితో ఎంఈఓ-2 వెంకటరమణ

సీతానగరం: మండలంలో బడిబయట ఉన్న చదువు పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులను విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించనున్నట్లు ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మండలంలో డ్రాపవుట్స్ ఉన్న విద్యార్థులెక్కడున్నారో గుర్తించడానికి సీఆర్పీలు చేసిన సర్వేలో వెల్లడైన వారి సంరక్షకులతో ఎంఈఓలు శుక్రవారం మాట్లాడారు. ఈ మేరకు బూర్జ ఉన్నత పాఠశాలలో డ్రాపవుట్ విద్యార్థి ఎస్.అన్నమయ్యను, రంగంపేట గ్రామంలో మరొక విద్యార్థిని పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తే వారందరినీ ప్రభుత్వం అన్నివిధాలా విద్యాపరంగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల సంరక్షకులు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టసవరణ బిల్లును రద్దుచేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు, ముస్లింలు

పార్వతీపురం: పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దుచేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని బంగారమ్మకాలనీ, పాలకొండ రోడ్డులోగల మసీదులలో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్‌లు మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి కామన్ సివిల్‌కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలతో మతోన్మాద శక్తులు చెలరేగిపోతున్నాయన్నారు. సరికొత్త చట్టంద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడికి ప్రభుత్వం తలపెట్టిందని, ఈ బిల్లు ఆమోదం టీడీపీ, జనసేనల లౌకిక తత్వానికి విఘాతం కలిగించేలా ఉందన్నారు. ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించి ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

నాణ్యమైన జీడి పిక్కలు కొనుగోలు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: జీడిపరిశ్రమ కోసం నాణ్యమైన జీడి పిక్కలను కొనుగోలు చేయాలని వీడీవీకేలను ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం గిరిమిత్ర సమావేశ మందిరంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి పరిశ్రమ స్థాపనకు జీడి పిక్కల కొనుగోలు, ప్రాసెసింగ్, బ్రాండింగ్ ప్రధానమని, వాటిపై దృష్టిసారించాలని సూచించారు. జీడి పిక్కల సేకరణ కోసం గ్రామస్థాయిలో ప్రొక్యూర్‌మెంట్ కమిటీకి ఇవ్వాలని చెప్పారు. జీడిపిక్కల ప్రాసెసింగ్‌కు అవసరమైన పరికరాలను వీడీవీకేల ద్వారా కొనుగోలు చేయాలని చెప్పారు. ప్రాసెసింగ్‌కు అవసరమైన అనుమతులను ముందుగానే పొందాలని సూచించారు. జీడి పిక్కల కొనుగోలు, రవాణా, స్టోరేజీ, ప్రాసెసింగ్, విక్రయాలు తదితర అంశాలన్నింటినీ కచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి బి.మాధవి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, వెలుగు ఏపీడీ వై. సత్యంనాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎంవీకరణాకర్, ఐటీడీఏ ఏపీడీ మురళీధర్ తదితరులు ఉన్నారు.

10న పండ్ల తోటల బహిరంగ వేలం

పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఈనెల 10న ఉదయం 10 గంటలకు పండ్ల తోటల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను గుమ్మలక్ష్మీపురం మండలం సవర కోటపాడులో హెచ్ఎన్‌టీసీ ఫారంలో గల జీడిమామిడి, కొబ్బరి, సపోటా, మామిడి పంటల తోటలు, కురుపాం మండలం రస్తాకుంటుబాయిలో జీడిమామిడి తోటకు సంబంధించి ఫలసాయం బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నామన్నారు. గిరిజన రైతుల నుంచి టెండర్ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఐటీడీఏ పీఓ కార్యాలయం వద్ద కానీ, హెచ్ఎన్‌టీసీ నర్సరీ, సవర కోటపాడు వద్ద కానీ రూ.200లు చెల్లించి దరఖాస్తును పొందవచ్చని చెప్పారు. ఆసక్తి గల గిరిజనులు ఈ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్

సాలూరు:

మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ బీవీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శ్యామలాంబ పండగ దృష్ట్యా బుడా సంస్థ నుంచి రూ.1.5 కోట్లు మున్సిపాలిటీకి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినా, ఇప్పటివరకు మంజూరు కాలేదన్నారు. కాగా బీపీఎస్ స్కీం కింద రూ.రెండు కోట్లు మున్సిపాలిటీకి అప్పు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో సామాజిక మరుగుదొడ్లు, 20 తాగునీటి బోర్లు, 32 పైలెట్ వాటర్‌స్కీంలు, మరమ్మతుల బారిన పడిన 6 పైలెట్ వాటర్‌స్కీంలు మరమ్మతులు తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. శ్యామలాంబ పండగ ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం

సాలూరు: పట్టణంలోని రజకవీధిలో గల రామమందిరం వద్ద సీతారాముల కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సప్తమి ప్రతిష్టను పురస్కరించుకుని ఆలయ అనువంశిక ధర్మకర్తలైన కూనిశెట్టి జెట్టిదొర కుటుంబసభ్యులు ఈ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కేజీబీవీలో ప్రాజెక్టుల ప్రదర్శన



బహుమతులు పొందిన విద్యార్థులతో జిల్లా సైన్స్ టీచర్ గిరడ లక్ష్మణరావు

సీతానగరం: మండలంలోని జోగింపేట కేజీబీవీలో జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు పర్యవేక్షణలో శుక్రవారం ఔత్సాహిక పారిశ్రామిక 'వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం' ప్రిన్సిపాల్ జొన్నాడ సంధ్య అధ్యక్షతన జరిగింది. వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో జిల్లాలోని 40 విద్యాలయాలనుంచి 5 ప్రాజెక్ట్స్ వంతున 200 ప్రాజెక్ట్స్ నుంచి ఆన్‌లైన్ ఫిల్టరేషన్ చేసిన తరువాత టాప్‌లో ఉన్న 10 ప్రాజెక్ట్‌సను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సందర్భంగా ఇన్‌చార్జ్ డీఈఓ రమాజ్యోతి చరవాణి ద్వారా విద్యార్థులకు సందేశం అందించారు. సమగ్ర శిక్ష ఏపీసీ రెడ్డి తేజేశ్వరరావు, విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

విజేతల వివరాలు..

మొదటి బహుమతిని జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన పి.గీతాంజలి, ఎస్.హరిసువర్చల వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ అమలుపై గెలుచుకున్నారు.

రెండవ బహుతి.. నేచురల్ సోప్‌విత్ స్క్రబ్బర్ ప్రాజెక్టుకు సంబంధించి ఎల్.సిరివెన్నెల, ఎం జాస్మిత, బి.డింపుల్ గెలుచుకోగా మూడవ బహుమతి పాలకొండ మక్కువలకు దక్కాయి.

వైఎస్‌ఆర్‌సీపీ మండలకమిటీ నియామకం

సీతానగరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ సీతానగరం మండల కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడి బి.చిట్టిరాజు ఇప్పటికే నియమితులు కాగా ఉపాధ్యక్షులుగా బుడితి గౌరునాయుడు, ఆర్వీ కిశోర్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా బొన్నాడ తిరుపతిరావు, మూడడ్ల మన్మథరావు, రెడ్డి వెంకటరమణ, పి.తిరుపతిరావు. కార్యదర్శులుగా శంకరరావు, వెంకటరమణ, చప్ప సురేష్, ఉడుముల గౌరునాయుడు, కల్యంపూడి శ్రీనివాసరావు, రెడ్డి అప్పలనాయుడు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా టి.రామారావు, కలిగి తవుడు, ఎం.మన్మథరావు, బంకపల్లి సింహాచలం, ఎం.త్రినాథ, ఎం స్వామినాయుడు, వి.జగన్నాథం, రెడ్డి మురళి, వై.గోపాల్, ఎం.సూర్యా రావు, కె.శ్రీను, డి.సింహాచలం, వి.ధనబాబు, వై.శివున్నాయుడు, వై రాధాకృష్ణ, పోల బలరాంనాయుడు, ఉడుముల కుమార్, ఎం. ప్రభాకరరావు, కోట.రామకృష్ణ, బి.సూర్యనారాయణ, పి. సూర్యనారాయణ, రెడ్డి తవిటినాయుడు, వై.త్రినాథనాయుడు, బి. శ్రీనివాసరావు, కె.మోహన్, పి.వాసు, ఎం.సింహాచలం, యు.శ్రీనివాసరావు, చెల్లూరి వెంకటరమణ, సబ్బాన ఆనంద్‌లను నిమిస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. తమను పార్టీ పదవుల్లో నియమించేందుకు కృషిచేసిన నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వారంతా కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థుల స్కూల్ హాజరు రికార్డుల పరిశీలన



మాట్లాడుతున్న ఎంఈఓ సూరిదేముడు

సీతానగరం: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, స్కూల్ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. పాఠశాలల యాన్యువల్ తనిఖీల్లో భాగంగా శుక్రవారం కె.సీతారాంపురం పాఠశాలను ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న విద్యావనరులను సక్రమంగా, సకాలంలో నిర్వహించడానికి ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీలు చొరవ తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు రికార్డులు, అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం.కిచెన్ కూరగాయల తోటలు, పరిసరాలు పరిశుభ్రత, విద్యార్థుల మరుగుదొడ్లను నీటి వనరుల కల్పనను పరిశీలించారు. వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థుల హాజరుశాతాన్ని పెంపొందించుకునేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి పేరెంట్స్‌కు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిబ్బందితో విద్యార్థులకు అందించనున్న విద్యావిధానంపై సమీక్షించారు. సక్రమంగా రికార్డులు నిర్వహించిన హెచ్‌ఎం శ్రీదేవిని ఎంఈఓ సూరిదేముడు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తపస్కాల ప్రార్థనలు



బాలగుడబలో శిలువ మార్గంలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

పార్వతీపురం రూరల్: క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన 45 తపస్కాల రోజుల్లో భాగంగా మండలంలోని బాలగుడబ గ్రామంలో పరిశుద్ధ 14 స్థలాల శిలువమార్గం, ప్రార్థన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో క్రైస్తవ సోదరులు శుక్రవారం నిర్వహించారు. ముందుగా గ్రామప్రారంభంలో ఉన్న మరియమ్మ గ్రోటో నుంచి ఆర్‌సీఎం ప్రార్థన మందిరం వరకు శిలువ మార్గాన్ని నిర్వహించారు. అనంతరం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన కూటమి కార్యక్రమంలో క్రైస్తవ విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్రార్థనలో ఎర్ర సామంతవలస విచారణకు చెందిన ఫాదర్ జీవన్‌బాబు బెలగాం విచారణకు చెందిన ఫాదర్ కె. తోమస్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, ప్రసంగాలు నిర్వహించారు.


పాఠశాల విద్యారంగ సంస్కరణలు చేపట్టాలి



ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పార్వతీపురంటౌన్: పాఠశాల విద్యారంగ సంస్కరణలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు అన్నారు. ఈ మేరకు పాఠశాల విద్యారంగంలో తీసుకువస్తున్న సంస్కరణల నేపథ్యంలో, రాష్ట్రశాఖ పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు యూటీఎఫ్ జిల్లా శాఖ తరపున శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను ఇతర ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేయకూడదని, యూపీ స్కూల్‌లోని 6,7,8 తరగతులను ఎత్తి వేయవద్దని కోరారు. తెలుగు, ఇంగ్లిష్, మీడియాలను సమాంతరంగా కొనసాగించాలని ఎమ్మెల్యే ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.శ్రీను, కె. మురళి, వసంత తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



ఎమ్మార్‌నగరంలో కల్యాణానికి సిద్ధం చేసిన విగ్రహ మూర్తులు



నర్సిపురంలో ముస్తాబైన కోదండరామస్వామి ఆలయం

పార్వతీపురం రూరల్:

సీతారాముల కల్యాణ వేడుక 'శ్రీరామనవమి'కి గ్రామాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రామాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాల ముందు పందిళ్లు, మంటపాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. హిందువులకు అత్యంత శుభప్రదమైన శ్రీరామనవమి రోజున కల్యాణంలో పాల్గొనేందుకు, శ్రీరాముడికి భక్తి శ్రద్ధలతో బెల్లం పానకం, వడపప్పు వంటి నైవేద్యాలు సమర్పించేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించి అన్న సమారాధన వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వసుంధర నగర్‌లో ఆలయ ప్రథమ వార్షికోత్సవం

మండల పరిధి వసుంధరనగర్‌లో ఉన్న సీతారామ మందిర ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా 6వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఉదయం 10గంటలకు ఘనంగా సీతారాముల వారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1గంటకు ప్రసాద వితరణ, రాత్రి 7గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించనున్నారు.

నర్సిపురంలో స్వామివారి తిరువీధి

నర్సిపురం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం గ్రామంలోని చిన్నవీధిలో గల కోదండరామ ఆలయంలో వీరఘట్టం గ్రామానికి చెందిన ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల కల్యాణ మహోత్సవం జరిపించనున్నారు. ఈ కల్యాణంలో పాల్గొనే భక్తులు పూజలకు సంబంధించి సామగ్రితో హాజరు కావాలని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించి సాయంత్రం 4గంటలకు కోలాటం బృందాల నృత్య ప్రదర్శనతో స్వామివారిని తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు.

పెదబొండపల్లిలో నేడు ఊరేగింపు..

శ్రీరామనవమిని పురస్కరించుకుని పెదబొండపల్లి గ్రామంలో శనివారం రాముల వారి ఉత్సవ మూర్తులను గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగించనున్నారు. అలాగే గ్రామంలో ఉన్న శ్రీరాముల వారి ఆలయంలో భక్తులకు ఆదివారం మధ్యాహ్నం శ్రీరాముల వారి కల్యాణం అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు పేర్కొన్నారు.

మేట్‌లుగా కొనసాగించాలి



డ్వామా పీడీ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేస్తున్న మేట్లు

పార్వతీపురం: ఉపాధి హామీ పథకంలో మేట్‌లుగా తమను కొనసాగించాలని కోరుతూ డ్వామా పీడీ కె.రామచంద్రరావుకు పలువురు మేట్లు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం డ్వామా కార్యాలయంలో కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన గంట గౌరీశ్వరి, జెంజేటి లక్ష్మి, జె.గోపినాయుడు తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉపాధిహామీ పథకంలో మేట్‌లుగా పనిచేస్తున్నామని, కొద్ది రోజుల నుంచి ఏపీఓ తమను మేట్లుగా గుర్తించకుండా వేతనదారులుగా ఉండమని ఆదేశిస్తున్నారన్నారు. దీనివల్ల తాము నష్టపోతున్నామని వాపోయారు. మేట్‌లుగా కొనసాగించేలా ఆదేశించాలని కోరారు. దీనిపై డ్వామా పీడీ మాట్లాడుతూ మేట్లను ఎవరూ తొలగించేది లేదని, మేట్లుగా కొనసాగాలంటే 30నుంచి 50మంది వేతనదారుల అనుమతి అవసరమన్నారు. వేతనదారుల అనుమతితో దరఖాస్తు చేసుకుంటే మేట్లుగా కొనసాగించనున్నామన్నారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో మాజీ ఎంపీటీసీ గొర్లి రవీంద్ర తదితరులు ఉన్నారు.